**ఒక్కొక్కటిగా గోవులు మాయమైపోయాయి. గోపికలూనూ. బృందావనం బోసిపోతోంది. క్రిష్ణయ్య ఒంటరివాడైపోయాడు. వాపోతున్నాడు. క్రమక్రమంగా కమ్ముకుంటోన్న ఒంటరితనంతో బెంగెట్టుకుంటున్నాడు. భంగపడిపోతున్నాడు. యమున కన్నీటి ధారలా వుంది. మురళి పలకనంటోంది. గోవులు చుట్టూ లేక గోపాలుడు ఒంటరై, అంతటి బృందావనంలోనూ ఒంటరిగా ఎన్నాళ్లుంటాడు... మాయమైపోవడం మొదలెట్టాడు. మాయమవడం ఖాయమైంది. కరిగిపోతున్నాడు. కృష్ణావతారం కాలగర్భంలో కలిసిపోతోంది... కలలా... కల కరిగిపోతోంది.**

దిగ్గున మేల్కొన్నాను.


కృష్ణావతారాంతం... మంచం ప్రక్కనే నీళ్ల బాటిల్లోంచి రెండు గుక్కలు తాగాను. మినరల్ వాటర్ మా పల్లెటూళ్లో కూడా. యాంత్రికత... కాస్త ఇబ్బందిగా గొంతు దిగింది.


సుభద్రని నిద్ర లేపి క్రిష్ణుడు కల్లోకొచ్చేడని చెప్తే ఏమంటుంది?!

సుభద్రనీ చంటిగాడినీ చూసేను. హాయిగా నిద్దరోతున్నారు- గోవూ- తువ్వాయిల్లా. చంటిగాడి వేపు చూడగానే మళ్లీ నా మనసు పాడైంది.

# బేహారం

**- డా. యల్.కె.సుధాకర్**





క్రిష్ణుడు గుర్తొచ్చాడు. ఒంటరి క్రిష్ణుడు. తన అవతారం చాలించే ముందు.. ఆ జగన్నాటక సూత్రధారి ఏమనుకుని వుండుంటాడు? కొన్ని వేల సంవత్సరాల తర్వాత, ఈ భూమ్మీద వుండే మానవ జాతి గురించి ఒక్క క్షణమైనా ఆలోచించి వుంటాడా? ఒకవేళ ఆలోచించుంటే ఇవ్వాల్టి మనుషుల మనస్థితి ఆయనకి తట్టే వుంటుందా? పిచ్చిపిచ్చి ఆలోచనలు...

వీటన్నిటికీ కారణం బహుశా ప్రొద్దుటి సంఘటనే.

'ఎన్నడయినా ఇంటావంటా వంశం మొత్తంలో ఎక్కడయినా వుందా? చోద్యం కాకపోతే. దూడనమ్మేసుకుంటార్రా... అదీ కోతకి... ఇదే మీ నాన్నగారు బతికుంటే ఇలా జరిగుండేదా? ఎంతరిష్టం ఎంతప్రదిష్ట. దూడని అమ్మేయడమేంట్రా ఖర్మకాకపోతే'' అంటో నెత్తీనోరూ కొట్టుకుంటోంది అమ్మ.

మగ దూడ- ఆరునెలల వయసుది... ఇక దాంతో మాకెవరికీ పన్లేదు. అదెందుకూ పనికిరాదు. రెండు వేలిస్తానన్నాడు బ్రోకరు. కబేళాకి. ఆరు నెలల వయసులోని దూడ మాంసం గిరాకీ ఎక్కువట. రేటెక్కువ పలుకుతుందిట.

'ఎందుకూ ఉపయోగపడని దూడ రెండువేలు ఆదాయం తెచ్చిపెడుతుంటే కాదంటుందేమిటీ అమ్మ' అనుకున్నాను. పైగా ఆ రెండువేల విలువ ఆ సమయంలో ఎంత ముఖ్యమో అమ్మకి చెపుదామా అనిపించిందోక్షణం... ఉపయోగం వుండదు.

దూడకీ అమ్మకీ లేదా పాడి పశువుకీ పాత తరాలకీ మధ్య పెనవేసుకున్న అనుబంధం ముందు ఏ వివరణా అచ్చిరాదన్న సంగతి నాకు బాగా తెలుసు. ప్రేమకీ వ్యాపారానికీ ఏ కాలంలోనూ లంకె కుదరదు.

⁂

అందుకే ఏ వాదోపవాదాలకీ చోటీయకుండా దూడని అమ్మేశాను.

అమ్మ మాటనికాదని... అమ్మని కాదని... అమ్మ గోలెడుతూనే వుంది. అది మామూలే. నన్ను కదిలించేస్తోన్న అంశం అది కాదు. ఉదయాన గొడ్డుని తోలుకెళ్లేముందు బ్రోకరు ఇచ్చిన డబ్బు లెక్కెడుతున్నప్పుడు చంటిగాడు చూసిన చూపు. అదీ నన్ను కాల్చేస్తోంది- ప్రొద్దున్నుంచీ. వాడు అటువేపు తిరిగి ఏడ్వడం మొదలెట్టాడు. నాకు నవ్వొస్తోంది. ''ఊర్కోగాడిదా! దూడని అమ్మేస్తే ఏడుస్తార్రా ఎవరైనా? అంతోటి ఇంగ్లీషు కాన్వెంట్‌లో ఏం నేర్పుతున్నార్రావాళ్లు? ఇక చాల్లే... ఏడుపాపు'' అన్నాను గానీ వాడి ఏడుపుకంటే వాడి చూపు ఎక్కువ పదునుగా నాలో గుచ్చుకుంటోంది.

బహుశా అదే క్రిష్ణుడి కల

**ఉగాది పోటీలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

నుకుంటా దూడని అమ్మేస్తే వచ్చిన రెండువేలతో పురుగు మందు డబ్బాకొనాలి. పంటకి వెయ్యాలి. రెండువేల విలువ అమ్మకీ చంటిగాడికీ ఏం తెలుసు??!

⁂

మజ్జిగ కవ్వాలూ, ఆ కవ్వాలు చిలికే చేతుల గాజుల సంగీతాలూ, వెన్న దొంగలూ, గోపాలురు, గోవుల మందలూ,

గోధూళి వేళలూ...

"మా రోజుల్లో ఇళ్లంటుకుంటే... నీళ్లతోకాదు... మజ్జిగతో ఆర్పేవాళ్లు. అంత పాడి వుండేది". అమ్మ చంటిగాడ్ని ఒళ్లో కూర్చోబెట్టుకుని చెప్పే కబుర్లు వింటుంటే మనసంతా ఏదోలా అయిపోతుంటుంది.

"భారతదేశము వ్యవసాయ ప్రధాన దేశము"- ఇంగ్లీషులో చంటిగాడు చదివే ఆ వాక్యం వింటే ఎవరిమీదో తెలియని కోపం పెల్లుబికి పోతుంటుంది.

పాడీపంటలతో హాయిగా వున్న పశువుల సంపదతో గ్రామం సరితూగుతున్నప్పుడు... ఒక విప్లవంలా వచ్చింది- కృత్రిమ గర్భోత్పత్తి. మేలుజాతి (?) దూడల్ని పుట్టించడవే లక్ష్యంగా రైతుల ఇళ్లల్లో ఒక కుటుంబ సభ్యుడిలా మసలే పాడి పశువుకి సంకర జాతి దూడల ఉత్పాదన. ఎక్కువ పాలిచ్చే పశువుల ఉత్పత్తి తద్వారా పాడి పరిశ్రమ విభాగంలో పెనుమార్పులకి శ్రీకారం.

అన్ని కొత్త మార్పుల్లాగానే ఈ కృత్రిమ గర్భోత్పత్తి విధానం కూడా కొత్తల్లో రైతులకి ఎక్కలేదు. క్రమక్రమంగా రైతాంగమంతా అలవాటుపడిపోయారు. ఆవులూ గేదెలూ మొత్తం పాతికేళ్లలో సంకరజాతివైపోయాయి.

చూస్తుండగానే పశుసంవర్ధనం తన దిశను మార్చుకుంది. పాల దిగుబడిలో దేశం తన స్థానాన్ని మార్చుకుంటోంది- పైపైకి. ముందుకి దూసుకుపోతోంది. డిగ్రీ చదివి ఉద్యోగంలోజేరి, ఆ వాతావరణం నచ్చక, నేనేమో ఇలా వ్యవసాయంలో స్థిరపడ్డాను. నా సహాధ్యాయి ప్రభాకర్ తనూ గవర్నమెంటుద్యోగంతో విసిగిపోయి, స్వంతంగా మా ఊళ్ళోనే కాన్వెంట్ పెట్టుకున్నాడు. చూస్తుండగా ఓ విద్యాసంస్థకి యజమానిగా మారిపోయాడు.

మనమనుకున్నంత హాయిగా సాగితే అది మామూలు కాలమెలా అవుతుంది సాగలేదు. ఇక్కడి హైవే రోడ్ దగ్గర్లో ఈ చుట్టుప్రక్కల ఊళ్లన్నిటినీ కవర్ చేస్తూ ఓ కార్పొరేట్ విద్యాసంస్థ వెలిసింది. ఎవరికి వాళ్లు పూర్తిగా ఆ మాయలో పడ్డారు. మా ప్రభాకర్ తన స్కూలు మూసేసుకోవాల్సి వచ్చింది. చివరికి ఆ కార్పొరేట్ స్కూల్లోనే ఓ 'సబ్జెక్ట్ మేటర్ స్పెషలిస్టు'గా జాయినయ్యేడు. విద్యని సంకరం చేయడం మా ఊళ్లో ప్రభాకరే మొదలెట్టాడు. అది పూర్తిగా సంకరమయ్యేనాటికి తనే ఆ మంటలో శలభమైపోయాడు.

ప్రతీరోజూ వాడూ నేనూ అలా గోదారొడ్డుకి షికారెళ్లడం పరిపాటి. ఇప్పుడిప్పుడే మా పల్లెటూరు తన మేకప్‌ని మార్చుకుంటోంది. చిన్నపాటి నగరంగా రూపాంతరం చెందబోతోంది. మార్పుని మా ప్రభాకర్ గమనించినంతగా మరెవరికీ సాధ్యంకాదేమోననిపిస్తుంటుంది.

"ఉదయం జెర్సీగిత్తని అమ్మేశాన్రా! మా పిల్లాడు ఏడ్చాడు. అమ్మ తిట్టింది"- ప్రభాకర్ ఏమీ మాట్లాడలేదు. గోదారికేసి గోదారిలో శబ్దం చేస్తూ దూసుకుపోతోన్న మరపడవకేసీ చూస్తూ కూర్చున్నాడు.

"మనుషుల్లో మగపిల్లాడిని ఆడపిల్లకంటే గారాబంగా పెంచుకున్నట్టు వాడి ద్వారా రాబోయే కట్నకానుకల్ని కలగన్నట్టూ, పశువుల్లో ఆడ దూడల్ని మాత్రం ఉంచుకొని మగదూడల్ని అమ్మేయడం మామూలే కదరా!"

"ఇంకా నయం! మామూలుగా అయితే మగ దూడలు మూణ్నెళ్లలోపే చచ్చిపోతాయి. లేదా తక్కువగా పాలు వదలి, తక్కువగా పోషిస్తూ ఆ దూడ చనిపోయే ఏర్పాటు రైతే సిద్ధంచేసి పెడతాడు. మొత్తానికి చావడం ఖాయం. అదే పెయ్యిదూడయితే ఉండే సెంటిమెంటే వేరు. ఆ విధంగా చూస్తే నువ్వు మంచి రైతువే. ఆర్నెళ్లపాటు ఆరోగ్యంగా మగ దూడని పోషించావు"- అంటూ నవ్వేడు.

"అమ్మింది కూడా ఊరికే కాదురా! ఆ డబ్బుతో పురుగుల మందు కొనాలి" ప్రభాకర్ నిట్టూర్చాడు.

ఒక్కసారిగా వెనక్కి, వెనక్కి, వెనక్కి వెళ్లినట్టున్నాయి అతడి చూపులు. నలభై ఏళ్ల క్రితం... కేవలం సేంద్రీయ ఎరువుల సహాయంతో పంటలు పండించిన బంగారు కాలంలోకి. రైతు ముంగిట్లో నడయాడే పశువుల పెంటనీ మూత్రాన్నీ ఎరువులుగా వాడి సమృద్ధిగా పంటలు పండించి 'రైతే రాజు'అన్న జాతీయాన్ని నిజంచేసిన రోజుల్ని తల్చుకుంటూ... ఇదే విషయాన్ని వివరించాడు.



**మగ దూడలతో పనేంటని అనుకుంటున్నాం... కబేళాకి తోలేస్తున్నాం. ఆడ దూడల సంఖ్య పెంచేందుకు సరిపడా టెక్నాలజీ ఇంకా లేదు కదా! ప్రకృతిదేం తప్పులేదురా! ఎంత శాతం మగ దూడలుండాలి ఎంత శాతం ఆడదూడలు పుట్టాలి అన్నది తన సమతుల్యతాభావంతో సాధిస్తూనే వుంది. మనిషే తనకిష్టం వచ్చినట్టు సమీకరణాల్ని తనకి సరిపడా మార్చుకుంటున్నాడు.**

ఇప్పుడు చూడు... మగ దూడలతో పనేంటని అనుకుంటున్నాం... కబేళాకి తోలేస్తున్నాం. ఆడ దూడల సంఖ్య పెంచేందుకు సరిపడా టెక్నాలజీ ఇంకా లేదు కదా! ప్రకృతిదేం తప్పులేదురా! ఎంత శాతం మగ దూడలుండాలి ఎంత శాతం ఆడదూడలు పుట్టాలి అన్నది తన సమతుల్యతాభావంతో సాధిస్తూనే వుంది. మనిషే తనకిష్టం వచ్చినట్టు సమీకరణాల్ని తనకి సరిపడా మార్చుకుంటున్నాడు. అవసరమైతే తన వ్యాపారానికి అడ్డొచ్చేప్పుడు ఒక జాతిని పూర్తిగా నిర్మూలించడానిక్కూడా వెనుకాడకుండా!!!

తనచుట్టూ తాను బిగించుకున్న వ్యాపారపు ఉచ్చులో చుట్టూ పెరుగుతున్న డబ్బుచెట్లనీ డబ్బు పూలనీ డబ్బు ఫలాన్నీ చూసి చూసి అదే జీవితమనుకునే స్థాయిలో ప్రస్తుతమున్న మనిషి తన మనుగడ కూడా ఒకరోజు ప్రశ్నార్థకమైన రోజున ఏమాలోచిస్తాడు?!

నాకు కలలోకొచ్చిన క్రిష్ణుడు గుర్తొచ్చాడు.

❋ ❋ ❋

గోదారి గాలి అమ్మలా మా తల నిమిరుతోంది.

భరింపలేనంత బరువులతో లారీలు దూరంగా గోదారొంతెన మీంచి సాగిపోతున్నాయ్. ప్రయాణ సాధనాలూ, రవాణా సౌకర్యాలూ ఇవన్నీ కేవలం వ్యాపారాభివృద్ధికే తప్ప మరే ఇతర అంశాల్లో మన జీవితాన్ని ప్రభావం చేస్తున్నాయో తేల్చుకోవడం కొంచెం కష్టంగానే వుంది.

ఇంతలో- గట్టుమీదుగా ఓ కారొచ్చి మాదగ్గరాగింది. చూడగానే గవర్నమెంటాఫీసరులా వున్నాయన కారు దిగేడు. మామూలుగా వుండే అధికార దర్పాన్ని కాసేపు ప్రక్కనపెట్టినట్టున్నాడు. మర్యాదగా దగ్గరికొచ్చాడు. అతడు అడిగిన విషయం నన్ను ఆశ్చర్యానికీ మా ప్రభాకర్‌కి కాస్త ఆవేదననీ రగిలించింది.

"నేను పశుసంవర్ధక శాఖలో ఆఫీసరుని"అని పరిచయం చేసుకున్నాడు. అది ఆయన వెనుకున్న తెల్ల టోపీ బిళ్లబంట్రోతు ద్వారా తెలుస్తూనే వుంది.

"వెదుక్కుంటూ మీ ఊరికి పనిమీదొచ్చాను. ఈ ఊళ్లో నాలుగు పుంగనూరు జాతి ఆవులూ, ఒక ఒంగోలు గిత్తా వున్నట్టు సమాచారమందింది. వాటిని చూసి ఫొటోలు తీసికెళ్దామని వచ్చాను" ఆయన ఉపోద్ఘాతం నెమ్మదిగానూ, వీలయినంత మామూలుగానూ వుంది.

ఎక్కడున్నాయో చెప్పేడు ప్రభాకర్. ఆయన ఎంతో రిలీఫ్ ఫీలయ్యేడు వెళ్తూ వెళ్తూ థాంక్స్ చెప్పి మరీ వెళ్లాడు.

ఆయన వెళ్లిపోయాక నిట్టూర్చాడు ప్రభాకర్. "చూసేవా దుస్థితి మనం గర్వంగా, మన సంప్రదాయ ఆస్థిగా చెప్పుకోదగ్గ రెండు పశుజాతులు- వాటికోసం ఎక్కడయినా కనిపిస్తే ఫొటోలు తీసికోవడంకోసం జిల్లాస్థాయి అధికారుల వేట. మన జాతి సంపదని మనమే వెదుక్కోవాల్సి రావడం దౌర్భాగ్యం కదా!" అన్నాడు.

"పశు సంపద సంకరం కావడమన్నది మంచిది కాదంటావా అయితే?"

"నేను విధి విధానాలని తప్పుపట్టుకోవడం లేదు. ఏదో చేయబోతే, మరోటి జరుగుతున్న దానికి మనం దరం మూగసాక్షులైపోవడంలోని విషాదం గురించి ఆలోచిస్తున్నాను. ఇందాకాయన చెప్పినట్టు ఇది కేవలం ఫొటోలు తీసుకునేందుకు ఖచ్చితంగా అయ్యుండదు... దీని వెనుక ఇంకా పెద్ద బహుళజాతి తాలూకు కుట్ర వుండే వుంటుంది. ఏ కంపెనీ వాడో కాస్త ఎక్కువ డబ్బులిచ్చి మరీ ఆ వున్న రెండు మూడింటినీ తీసుకుపోతాడు- తన ప్రయోగాలకోసం లేదా... వాటిమీద పేటెంట్‌కి అప్లయి చేయడంకోసం..." గోదారి గాలి ఎందుకో వెచ్చగామొహాన కొట్టినట్టయింది. మళ్లీ సంకరజాతి పశుత్పత్తిమీదకి మళ్లింది సంభాషణ. గోపిగాడు కూడా మాతో కలిసేడు గోదారొడ్డున.

నా అనుమానాలూ, సమాధానాలు దొరకని ప్రశ్నలకి గోపీ నవ్వి ఓ వారం రోజులాగు. మా కాబోయే బావ పశువుల డాక్టరేగా. ఆయన్నడిగి మిగిలిన డౌట్లన్నీ తీర్చుకుందువుగాని అన్నాడు నవ్వి.

అలా ఆ సాయంత్రం ఆగిపోయిన మా సంభాషణని రాత్రి మా చంటాడు కొనసాగించాడు... అనుకోకుండా.

❋ ❋

"డాడీ! (నాన్నా అని పిల్చినట్టు తెలిస్తే వాడి కాన్వెంట్‌లో ఫైనేస్తారు మరి). మగ దూడని అమ్మేసేం సరే! ఆడ దూడలవల్ల లాభమేంటీ?

"పాలు".

"ఇలా అందరూ ఆడ దూడల్నే పెంచుకుంటూపోతే ఏం జరుగుతుంది".

"పాల వుత్పత్తి పెరుగుతుంది."

"అయితే." **(మిగతా 21వ పేజీలో)**

(9వ పేజీ తరువాయి)

"మనకి అంటే దేశానికి డబ్బొస్తోంది"- పాల వ్యాపారం ద్వారా,

"వస్తే."

"అంతా ధనవంతులయిపోతారు."

"అయితే."

"పేదవాళ్లు ఇక ఉండరన్నమాట."

అలా అని సమాధానం చెప్పేను గానీ ఆఖరి వాక్యం దగ్గరే నా ఆలోచనలు ఆగిపోయాయి. ఇన్నేళ్లుగా ఇన్ని శాస్త్రీయ పద్ధతులవలంబించాక కూడా... పేదరికం ఏం నిర్మూలించబడింది!? ఈ ప్రశ్న నాకే భయం గొల్పింది.

చంటాడు ఇంకేదో అడగబోయి- అయితే వ్యాపారం వల్ల అభివృద్ధి జరుగుతుందన్నమాట. మనకి పనిచెయ్యనిదేదైనా అమ్మేయడం ద్వారా డబ్బు సంపాయించొచ్చన్న మాట- అన్నాడు యిక నిద్రకి ఉపక్రమిస్తూ.

❁ ❁

రెండ్రోజుల తర్వాత సాయంత్రం చంటిగాడు జ్వరంతో ఇంటికొచ్చాడు.

వాడి వెనుకే మరో అరగంటలో ప్రభాకర్ హడావుడిగా అర్జెంట్‌గా రారా అంటూ గోదారొడ్డుకి తీసుకుపోయాడు.

"ఏరా! ఇంటిదగ్గరేమైనా గొడవ జరిగిందా? అమ్మతో ఏమైనా?" అనడిగేడు. కోడె దూడని కటిక వాడికమ్మేయడం గురించీ, అమ్మ కోప్పడడం గురించీ చెప్పేను. చంటిగాడు ఏడ్వడం గురించీ కూడా. "మొన్నొక రోజు క్లాసులో పిల్లల్ని ఎవరెవరు ఏయే చదువులు చదువుతారని అడిగ్గానా! మీవాడు పశువుల సైంటిస్టవుతానన్నాడు."

ఎందుకూ అనడిగితే- సైంటిస్ట్ అయి కేవలం తల్లులన్నీ ఆడ దూడల్ని మాత్రమే పుట్టించేలా ప్రయోగాలు చేస్తాట్ట. క్లాసంతా నవ్వేరు. నాకే ఏదో కష్టంగా... చేదుగా. విషయం ఇప్పుడర్ధమౌతోంది. ఇదే విషయం సోషల్ క్లాసులో కూడా జరిగిందిట "ఎకనామిక్స్"గురించి చెప్తోంటే "వ్యాపారం అంటే మనకి పనికిరాని దానిని మనం పనికిరాదని అనుకున్నప్పుడు ఎదుటివాళ్లకి కటిక వాడికైనాసరే అమ్మేయడమే"నన్నాట్ట.

"ఇదే కాదు... ఇవ్వాళ స్కూల్లో పరీక్ష పెట్టాం! మీవాడి ఆన్సర్ షీటు చూసి నోటమాట రాలేదు నాకు."

"జ్వరంకదా! బాగా రాయలేదా?" అనడిగేను.

"ఊహు! అది కాదు! నువ్వే చూడు" అంటూ ఆన్సర్ షీటిచ్చేడు.

అయిదు ప్రశ్నలు (ఇంగ్లీషులో)...

- జంతువులవల్ల మనకి కలిగే లాభమేమిటి- మా చంటిగాడి సమాధానం అవి వ్యాపారమునకు పనికి వచ్చును.
- మనిషి జంతువులను ఎందుకు మచ్చిక చేసుకొనెను- వ్యాపారం కొరకు.
- మానవుని అభివృద్ధికి జంతువులెలా తోడ్పడుతున్నాయి- వ్యాపారం ద్వారా. మొత్తం ప్రశ్నలన్నింటికీ వాడి సమాధానం ఒక్కటే.

కొన్ని విషయాలు ఊహించడం కష్టం. కొన్ని విషయాలు ఊహించుకున్నాక భరించడం ఇంకా కష్టం.

ఈ గందరగోళ పరిస్థితుల్ని మరింత విషాదంగా మారుస్తూ మరో విషయాన్ని మోసుకొచ్చేడు గోపిగాడు.

రావడం రావడమే "వాడు డాక్టరు కాదంట"అన్నాడు.

"ఎవరూ!?"

"అదే! మా కాబోయే బావ- పెళ్లాగిపోయింది."

ప్రభుత్వ పథకం తాలూకు స్వయం ఉపాధి పొందడం తద్వారా తన సేవల్ని తన ఊరికే అందించడంలోని చక్కని ఔన్నత్యాన్ని మనిషి మానసిక ప్రవృత్తి ఇలా వ్యాపారాత్మకమై మింగేస్తుండడం గురించి ఆలోచిస్తేనే హృదయం అదోలా అయిపోతోంది.

"అదేంట్రా! పశువుల డాక్టరని చెప్పావుకదా!"

"పశుమిత్ర అని పదోతరగతి వరకూ చదువుకున్న కుర్రాళ్లకి కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు చేయడం నేర్పించి, ఊరికొకరికి స్వయంఉపాధి కల్పిస్తోంది ప్రభుత్వం. అతడి డ్యూటీ అది. దాన్ని వాడు పశువుల డాక్టరుగా చెప్పుకుని చలామణీ అవుతున్నాడు. కేవలం స్వయం ఉపాధి పథకమంతే."

"అయితే ఏంటంట? ఏదోఒకటి స్వయంగా సంపాయిస్తున్నాడుకదరా! ఆ విషయం గురించి పెళ్లాపేయడమేంటి? ఊరంతా వైద్యం చేస్తున్నాడు కాబట్టి డాక్టరంటున్నారు అననీ!"అన్నాడు ప్రభాకర్.

అప్పుడు విప్పాడు రహస్యం గోపిగాడు-

"అది కాదురా! క్వాలిఫైడ్ పశువుల డాక్టర్‌నని చెప్పి పది లక్షల కట్నం డిమాండ్ చేసేడు. ఏడుకి బేరం కుదిరింది" అని.

ప్రభుత్వ పథకం తాలూకు స్వయం ఉపాధి పొందడం తద్వారా తన సేవల్ని తన ఊరికే అందించడంలోని చక్కని ఔన్నత్యాన్ని మనిషి మానసిక ప్రవృత్తి ఇలా వ్యాపారాత్మకమై మింగేస్తుండడం గురించి ఆలోచిస్తేనే హృదయం అదోలా అయిపోతోంది.

అదేకాదు- మమ్మల్ని ఆశ్చర్యపరిచిన విషయం మరొకటుంది- అది ఆ కుర్రాడు. అతడి తరపు వాళ్లంతా అతడు డాక్టరుకంటే ఏం తక్కువని గొడవకి దిగేర్ట.

వ్యాపారం...వ్యాపారం... జీవితం ప్రతీ క్షణమూ వ్యాపారమే. ఇదిలాగే కొనసాగి కొనసాగి తనకోసం తన వ్యాపారంకోసం సంకరమయ్యే భావాలూ, కాలాలూ తన స్వార్థంకోసం ఎంతకైనా తెగించేసి చివరికి నిర్మూలించాల్సి వస్తే ఒక జాతిజాతినే నిర్మూలించేసి... అలా అలా నిర్మూలించుకుంటూపోయి- చివరికి- ఆఖరికి మనిషొక్కడే మిగిలి వుండే ఏకాకి దృశ్యం ఊహించుకుని...

పిచ్చుకలు దాదాపు అంతరించిపోయేయి. ఎన్నో జాతులు మాయమైపోయాయి. అలాఅలా అన్నీ మాయమైపోయి మనిషి మాత్రమే మిగిలి వున్నప్పుడు ఆ దారుణం తల్చుకుంటూ... మొత్తం అంతా మా ప్రభాకర్‌కి చెప్పాను. వాడు నవ్వేడు. నవ్వి- "నువ్వు అనుకున్నట్టు జరగాలంటే ఇంకో వెయ్యో రెండువేల సంవత్సరాలో పడుతుంది. ఆఫ్ట్రాల్ ఈ భూమ్మీద నువ్వుండేది మహాఅయితే ఇంకో యాభై ఏళ్లు. ఆ మాత్రానికి మానవ జాతి గురించిన ఇంత ఆలోచన అవసరమట్రా" అన్నాడు.

మరి అందరూ అలానే అనుకుంటే ఇంకెవరాలోచిస్తారు?

❁ ❁

నేనూ, చంటి గోదారొడ్డున కూర్చున్నాం. వాడిని నెమ్మదిగా కబుర్లలో దింపాను. జ్వరం తగ్గి నీరసంగా వున్నాడు. నాకు తెల్సిన పరిధిలో వాడికి వివరించడం మొదలెట్టాను. చాలాసేపటి తర్వాత వాడు నాకు 'ట్యూన్' అయ్యేడు. అప్పుడు చెప్పేడు- "మొన్న రాత్రి అమ్మ నాయనమ్మని ఎందుకూ పనికి రానిదని, మనకేం ఉపయోగం లేనిదని అంది డాడీ! నాకేడుపొచ్చేసింది"అన్నాడు కళ్లు నీళ్లు కుక్కుకుంటూ అప్పుడర్థమైంది వాడి జ్వరానికాకారణం.

"అందరూ ఇలానే ఆలోచిస్తే... ఎలా డాడీ" అన్నాడు అమాయకంగా!

మమ్మల్ని వెదుక్కుంటూ మా కౌలుదారు శ్రీరాములు రావడం కనిపించింది. దగ్గరికొచ్చి, "బట్టలావు ఇవ్వాళ రాత్రికి ఈనేలా వుందండి"అన్నాడు. "మరింకేం ఉదయాన్నే కబురు చెప్పు" అన్నాను.

"లేదండి. ఈరాత్రి కూడా అక్కడే ఆవు ప్రక్కనే వుంటానండి. ఈనబోయేముందు తోడుగా" అన్నాడు ఆప్యాయంగా, పొలంవేపు అడుగులేస్తూ.

అందరిలా కాకుండా మరోలా ఆలోచించేవాడు. నాక్కనిపించినట్టయింది. శ్రీరాములు వెళ్లిన వేపే చూస్తూ గోదారొడ్డునుంచి ఇంటి దారి పట్టాను చంటిగాడితో.

❁ ❁

ఆ రాత్రి...

"డాడీ! బట్టలావు దూడని అమ్మేయకుండా పెంచుకుందాండీ అది మగ దూడయినాసరే!" అంటూ నిద్రలో కలవరిస్తున్నాడు చంటిగాడు. ★

## మొదటి పరమవీరచక్ర

సాహసం, త్యాగం మూర్తీభవించిన సైనికులకు భారత ప్రభుత్వమిచ్చే పరమ వీరచక్ర అవార్డును 1950 జనవరి 26న ప్రారంభించారు. మధ్యలో రాజముద్ర, చుట్టూ ఇంద్రుని వజ్రాయుధాన్ని, శివాజీ ఖడ్గాన్ని పోలి ఉండే మూడు చిహ్నాలు ఉంటాయి. ఈ అవార్డును సావిత్రి భాయి కానోల్కర్ అనే మహిళ డిజైన్ చేసింది. మొట్టమొదటిగా పరమ వీరచక్ర అవార్డును సోమనాధశర్మ అనే సైనికునికి అందజేశారు.

## హార్ట్‌అటాక్

**గుండె** నుంచి శరీరానికి, శరీరం నుంచి గుండెకు రక్త ప్రసరణకు సహకరించే కరోనరీ ధమనుల్లో ఏర్పడే ఆటంకం కారణంగా గుండెపై వత్తిడి పెరిగి నొప్పి (యాంజైనా) పుడుతుంది. ఈ నొప్పి సాధారణంగా ఛాతీ మధ్య, ఎడమ భాగాల్లో పుడుతుంది. పని ఒత్తిడి కారణంగా పుట్టే యాంజైనా విశ్రాంతితో తగ్గుతుంది. ఒక్కోసారి ఈ నొప్పి ఎడమ చేతికి, భుజానికి వ్యాపిస్తుంది. రెండు చేతులు, మెడ, దవడలు, వీపులోకి కూడా వ్యాపించొచ్చు. అలాగే కరోనరీలో కొవ్వు పదార్థాలు పేరుకుపోయి, రక్త సరఫరా చేసే గుండె నాళాలు నిర్జీవమవుతాయి. ఈ కారణంగా గుండెపోటు (మయో కార్డియల్ ఇన్‌ఫార్క్షన్) సంభవిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ నొప్పి 15నుంచి 20 నిమిషాలపాటు కొనసాగితే గుండెపోటుగా భావించాలి.

**- పి.ఎం.సుందరరావు**